*బొబ్బిలి రాజ్యస్థాపనకు కారణమైన సవరదొరబిడ్డ కూచిపోతి సాహసం వరవడిలో వచ్చిందేమో, చరిత్ర ప్రసిద్ధినందుకున్న "బొబ్బిలి పౌరుషం!"*

**'సవర రగతమంటే సన్నీళ్ళు అనుకున్నాడా ఈ షేర్‌ఖాన్? మన్యం గ్రామాల్లో మంటలు రేపుతాడా! సవర దొరలంతా ఏకం కావాలి. సవర దొరసానులంతా నడుం కట్టాలి.**

**ఔరా! దుండగీడా! పన్ను కట్టలేదని సవర గూడాలను నేలమట్టం చేస్తావా? పన్ను కట్టేందుకు ప్రాణాలు, పౌరుష పరాక్రమాలు తప్పించి మనదగ్గరేమున్నాయి.**

తెల్లవారితే తెల్ల గుర్రాలమీద దౌడుతీస్తూ వస్తాడు షేర్ ఖాన్. ఏం చెయ్యాలి? చేతులు ముడుచుకు కూర్చోవాలా?" అని పొలికేక వేసి అడిగింది కూచిపోతి.

ఆమె సవర గూడానికి దొరబిడ్డ!

మండుతున్న నెగడు చుట్టూ దొరలూ దొరసానులూ కూర్చుని వున్నారు. పగలంతా అడవిలో వేటాడి తెచ్చుకున్న మాంసాన్ని చీకులకు గుచ్చి చింత నిప్పుల్లో కాల్చుకు తింటున్నారు. మధ్య మధ్య సొరకాయ డొల్లలోవున్న యిప్ప సారా రుచి చూస్తున్నారు.

చీకుల్ని అడ్డాకుదొన్నెల్లో ఉంచి ప్రియురాళ్ళకి అందించుకుంటున్నారు.

అదొక సవరగూడెం. దానిపేరు రంగవాక. మన్యం గూడాలకు గుండెకాయ ఆ గ్రామం. గూడెం దొర పేరు దొలబెహర. అతని బిడ్డ కూచిపోతి. పరాక్రమశాలిని పరాక్రమంలో చెప్పాలంటే పులిబిడ్డ.

మన్యం అడవుల్లో గడ్డ నీరు త్రాగుతూ, వేటాడి జీవనం సాగిస్తున్న సవరలకు పెద్ద గ్రామం రంగవాక. మొఘల్ ప్రభువుల తహసిల్‌దారుగా శ్రీకాకుళంలో వుంటున్నాడు షేర్ ఖాన్. శ్రీకాకుళం పరగణాలో అతని క్రూరత్వాన్ని కథలు కథలుగా చెప్పుకుంటారు. శిస్తు వసూళ్ళకు బయలుదేరినాడంటే మన్యం గడగడలాడుతుంది.

ఆటవికుల గూడాలు రోదిస్తాయి. శిస్తు కట్టలేని వాళ్ళ కొంపలు కాల్చి, దొరల్ని ఈటె పోటులతో కూల్చి, దొరసానుల్ని బానిసలుగా పట్టుకుపోతాడు షేర్ ఖాన్.

చాల కాలంగా సాగుతున్న కథ యిది.

కూచిపోతికి పద్దెనిమిదేళ్ళుంటాయి. చిన్నతనంనించీ ఈ కథలు విని విని ఆమె కడుపు రగులుతోంది.

ఇప్పుడు మళ్ళీ శిస్తు వసూలుకు బయలుదేరాడు షేర్ ఖాన్ ఈ వార్తవిన్న సవర గూడాలు గడగడలాడినాయి. ముఖ్యంగా రంగవాక. శిస్తు కట్టేందుకు వాళ్ళ దగ్గరేమున్నాయి. ప్రాణాలుతప్ప. పౌరుష పరాక్రమాలు తప్ప వారికెలాంటి ఆస్తులూ లేవు.

అయినా పన్ను కట్టి తీరాలంటాడు షేర్ ఖాన్.

అతని దగ్గర అయిదువేల సైన్యముంది. మన్యంలో యాభై వేలకు పైగా ఆటవికులున్నారు. కాని వారంతా చిన్న చిన్న గూడాలుగా విడిపోయి దూరప్రాంతాల్లో వుంటున్నారు. ఈ అనైక్యత షేర్ ఖాన్‌కు పెట్టుబడి అయింది.

ఒక ప్రక్కనించి గూడాలు తగుల బెట్టిస్తూ, ఆడవాళ్ళని బంధించి బానిసలుగా



చేస్తూ వస్తున్నాడు షేర్ ఖాన్.

నేడో రేపో రంగనాక అతని క్రౌర్యానికి బలికానుంది. సవరలంతా పౌరుషంతో పళ్ళు నూరుతున్నారు. కాని షేర్ ఖాన్ అయిదువేల సైన్యంతో వస్తున్నాడు.

ఎలా ఎదుర్కోవాలన్నదే సమస్య అయింది.

పగలంతా వేటాడి ఆహారం తెచ్చుకున్నారు. ఎర్రగా మండుతున్న చింత నెగడు చుట్టూ చేరి దిగులుగా కూర్చున్నారు. ఎప్పుడూ నవ్వుతూ, గలగల పారే గడ్డనీరులా సాగిపోయే వారి జీవితాలిప్పుడు గండ కత్తెరలో పడ్డాయి. వాళ్ళ సంతోషం ఇగిరిపోయింది.

తన వారందరిని చూసుకుని కూచిపోతికి కడుపు మండిపోయింది. నేత్రాలు విశాలమయినాయి.

"సవర రగతమున్ంటే సన్నీళ్ళు అనుకున్నాడా ఈ షేర్ ఖాన్" అన్నదామె మళ్ళీ. కళ్ళు చింతనిప్పుల్లా ఎర్రగా మండుతున్నాయి.

"అయిదువేల సైన్యంతో ఎత్తి వస్తున్నాడు దొర. ఏం చెయ్యాలి."

దొల బెహర నిస్సహాయంగా పళ్ళు నూరాడు.

"దొరా! నాకు ఆన యిచ్చినావంటే ఆడి ఆటలు కట్టిస్తాను" అంటూ అతని ముందు మోకరిల్లింది కూచిపోతి. కన్న కూతురు పౌరుష పరాక్రమాలను చూచి దొర కన్నులు చెమ్మగిల్లినాయి.

"బిడ్డా! సిర్కాకోల్ దొర దగ్గర సైన్యముంది. ఆయుధాలున్నాయి. ఆడదాయివి. నావ్వొక్కత్తెవీ బోయి యేంచేస్తావు? ఎట్లా తిరిగొస్తావు?" అని అనిగాడు దొల బెహర. కూచిపోతి నవ్వింది. నల్లని మేఘంలోంచి వూడిపడ్డ మెరుపులా వుందా నవ్వు.

"దొరా! నీ బిడ్డ పౌరుష పరాక్రమాల మీద నీకు నమ్మకంలేదా! నీ తరువాత ఈరంగ వాకను ఏలుకోవాల్సిన బాధ్యత నాకుంది. నీ బిడ్డ పులిబిడ్డ కాదా! మంది బలగంకన్నా మనోబలం గొప్పది కాదా దొరా! నన్ను నమ్ము. నాకు ఆన దయచేయి, షేర్ ఖాన్ ఆటకట్టించి నా ప్రజల ప్రాణాలు కాపాడుకుంటాను. నన్ను అనుపుదొరా!" అందామె ధైర్యంగా.

వింటున్న వాళ్ళు బొమ్మల్లా అయిపోయినారు. తమ చెవుల్ని తామే నమ్మలేనట్లుగా చూస్తున్నారు.

కూచిపోతికి ఆన దయచేశాడు దొర.

కడుపుకోత పేగుల్లో దాచుకుని, కన్నీటిని రెప్పలమాటున దాచుకుని ఆన దయచేశాడు దొర.

"పోయిరావే పులికూనా! నా తరువాత నీవారయిన ఈ ప్రజల ప్రాణాలు కాపాడుకో!" అన్నాడు.

పొంగిన శరీరంతో లేచింది కూచిపోతి

ఉక్కు ముక్కల్లా బిగిసిన కండరాలు, నల్లగా నిగనిగలాడే శరీరంమీద నెగడు మంటల నీడ ఎర్రగా పడుతోంది. అదొక చిత్రమయిన వర్ణంతో శరీరం మెరుస్తోంది. నడుముకు చుట్టివున్న మొల నూలుకు వ్రేలాడుతున్న పిడిబాకును ఒక్కసారి తడిమి చూసుకుంది. పదునైన యీటెను చేతితో పట్టుకుంది.

తనవారందరికీ ధైర్యంచెప్పింది కూచిపోతి.

కీర్రు మంటున్న కీకారణ్యం లోకి. చీకటిలోకి ఒక్క ఉదుటున పరుగు తీసిందామె


అడవిదారుల వెంట అయిదారు మైళ్ళు పయనించాక అల్లంత దూరంలో గుడారాల మధ్య వెలుగుతున్న కాగడాలు కన్పించాయి. ఒకఎత్తయిన బూరుగుచెట్టుమీదికి ఎక్కి ఆ వంక పరిశీలనగా చూచింది కూచిపోతి.


వందలాది గుడారాల మధ్య పట్టు వస్త్రాల డేరా కన్పిస్తోంది. కాగడాల వెలుగులో ధగధగలాడుతోందది. మొత్తం గుడారాలకు మధ్యలో వెండి గూటాలకు బంగారు తీగలు బిగించి నిర్మించిన డేరా! దానికి నాలుగువక్కలా ఉక్కుపిడుగులాంటి నలుగురు ఖొజ్జాలు భయంకరమయిన ఆయుధాలతో కావలాకాస్తున్నారు.

కూచిపోతి ఏనుగు తొండాల్లాంటి బూరుగు కొమ్మల మీదినించి ఛెంగున క్రిందికి దూకింది. ఒక్కసారి మొల నూలుకు బిగించివున్న పిడిబాకును తడిమి చూచుకుంది. చువ్వీటెను చేతిలో గట్టిగా పట్టుకుంది. చెదరిన జుట్టును సవరించుకుంది.

కారు చీకటిలో ముందుకు కదిలింది కూచిపోతి-

కీచురాళ్ళు కిర్రుమని రొద పెడుతున్నాయి. దూరంనించి నక్కల ఊళలు, అడవికుక్కల రోదన ధ్వనులు వినిపిస్తున్నాయి. భయంకరమయిన అడవిజంతు






వుల అరుపులు గుండెలు గుభిల్లు మనిపిస్తున్నాయి. కూచిపోతికి అడవిదారులు బాగా తెలుసు. పెద్ద పెద్ద అంగలతో ముందుకు పోతోంది.

మధ్యలో పొదల్లాంటివి అడ్డువస్తే ఛెంగున యెగిరి దూకుతోంది. అడుగుల క్రింద పడి నలిగిన ఎండుటాకులు గలగలమని శబ్దం చేస్తున్నాయి. ఆ శబ్దాలకు బుస్సున బుసకొట్టిన కాలనాగులు జరజరమంటూ ప్రక్కలకుతప్పుకుపోతున్నాయి.

గుడారాలకు అత్యంత సమీపంలోకి చేరుకుంది కూచిపోతి. ఒక గ్రామంలా వున్న డేరాలవెలుపలయవనాశ్వాలున్నాయి. అలికిడిని గుర్తించి అవి సకిలించాయి. హయహేషల అర్థాలను గ్రహించగల నిపుణుడయిన కాపలా మనిషి కాగడా ఎత్తి చుట్టూ చూశాడు.

కాటుకలాంటి చీకటిలో కూచిపోతి కపిలవర్ణ శరీరం ఇమిడిపోయింది. మళ్ళి కునుకు తీయటం ప్రారంభించాడతడు.

కూచిపోతి గుర్రాలమధ్యకు చేరుకుంది.

అక్కడనించి అత్యంత ప్రమాదకరమయిన, సాహసోపేతమయిన స్థితిలో నూరు ధనుస్సుల దూరం వెళ్తేకాని షేర్ ఖాన్ డేరా సమీపించేందుకు వీలుకాదు.

గుర్రాల మధ్యనించి మరొకరికి కన్పించకుండా ముందుకుపోయింది కూచిపోతి. గుడారాల ముందు ప్రక్క కాగడాలు వెలుగుతున్నాయి. చీకటితో కాగడాలు పోరాడుతున్నాయి.

గుడారాల వెనుక భాగాన క్రీనీడల్లో నడుస్తూ ముందుకు పోతోంది కూచిపోతి. సాహసోపేత మయిన ఈ ప్రయత్నంలో ధైర్యం తప్ప ఆమెకు మరొకతోడు లేదు'

ఒక గుడారం దాటుతూ వుండగా కలబందనారతో పేని తయారు చేసిన త్రాడు ఆమె కాలికి తగిలింది. దాంతో గుడారం ఊగిపోయింది. లోపలి వ్యక్తులు ఉలిక్కిపడ్డారు.

ఒక సైనికుడు ఖడ్గాన్నీ, మరొకడు కాగడానీ తీసుకుని గుడారం వెనుక ప్రక్కకు వచ్చారు.

ముందుగా వచ్చిన కాగడా వ్యక్తి నోటిమీద చేయివుంచి మొలనున్న పిడిబాకు బయటకులాగి గుభిల్లున అతని గుండెల్లో కుమ్మిందామె. చప్పుడు కాకుండా అతడు గమ్మున క్రిందపడిపోయినాడు

కాగడా వెళ్ళి గుడారంమీద పడింది.

జరిగిందేమిటో గ్రహించే లోపలే రెండవ సైనికుడి గుండెల్లో పడికుమ్మింది కూచిపోతి. వెచ్చని రక్తంతో నేల తడిసిపోయింది. అతడు అత్యంత దయనీయంగా ఆర్తనాగం లాంటిది చేశాడు. తనను పిడిబాకుతో పడకుమ్మిన వ్యక్తి కాలు పట్టుకున్నాడు.

"నువ్వు ఎవరయినా కావచ్చు. నన్ను ఎందుకయినా చంపి వుండవచ్చు. కాని నా ఆఖరు మాట విను" అన్నాడు హీన స్వరంతో.

కడుపు కక్కుర్తి కోసం ప్రాణాలకు తెగించి ఫౌజులో పని చేస్తున్న అతని అభ్యర్థన మన్నించి ఆగిపోయింది కూచిపోతి.

"నువ్వెవరో నాకు తెలియదు. తెలిసే అవకాశం వున్నా తెలుసుకునే సమయం నాకిప్పుడు లేదు. అంధురాలయిన నా తల్లి కోసం రెండు పదుల వరహాలు దాచి వుంచాను. ఆమె తన బిడ్డ డబ్బుతో తిరిగి వస్తాడని కనిపించని కళ్ళలో ఒత్తులు వేసుకుని ఎదురు చూస్తూ వుంటుంది. ఇవి ఆమెకు చేర్చు. శ్రీకాకుళం శివార్లలో వుంది నా ఊరు" అంటూ గుర్తు చెప్పాడు అతడు.

మరుక్షణం అతని తల నేలకు వాలింది

కూచిపోతి కళ్ళనించి ఒక్క కన్నీటి చుక్క టప్పున రాలిపడింది. ఆమెలో క్షణకాలం దయ, మానవత మేల్కొని మెరుపులా మాయమయినాయి.

మరుక్షణంలో మళ్ళీ కర్తవ్యం కళ్ళ ముందు కదలాడింది.

"దీనుడా! కడుపు కక్కుర్తి కోసం సైన్యంలో చేరి ప్రాణాలను బలియిచ్చిన సైనికుడా! నీ కోర్కె తీర్చుతా నన్న వాగ్దానం ఇవ్వక ముందే పోయినావా?" అనుకుంది మనసులో. అప్పటికే గుడారం చుట్టూ మంటలు లేచాయి. కాగడా గుడారం మీద పడటంతో అగ్ని ప్రమాదమయింది.

చుట్టుప్రక్కల గుడారాలు అంటుకుంటున్నాయి. సైనికులు హడావిడిగా అక్కడకు పరుగెత్తుకు వస్తున్నారు.

కూచిపోతి క్షణ కాలం ఆలోచించి ముందుకుపోయేందుకే నిశ్చయించుకుంది.

రివ్వున వింట విడిచిన బాణంలా దూసుకుపోయిందామె. మెరుపు డేరాను క్షణాలమీద చేరుకుంది. ఒక ప్రక్క దృఢకాయుడైన ఖొజ్జా భయంకరమైన ఆయుధంతో కాపలా కాస్తున్నాడు.


# ఋణం

వ్యాపారాభివృద్ధి కోసం ఆకర్షణీయమైన షరతులమీద భవనం, వ్యాపారం, షాపులు, భూములు, థియేటర్లు, లిమిటెడ్ కంపెనీలు, పరిశ్రమలు వగైరాలపై రు. 20,000 లేక ఆపైన ఋణం లభించును.

వ్రాయండి లేదా సంప్రదించండి. ఫోన్ : 395126

**SUPREME CORPORATION (BANKERS)**

-15, "EVEREST" 7th Floor, Near Famous cine laboratory, Tardeo Road, BOMBAY-400 034.

ఉత్తర ప్రత్యుత్తరాలు ఇంగ్లీషులో.

అతడు మంగోలియన్ మహావీరుడు.

గోబీ ఎడారి నుంచి ఢిల్లీ తలుపులు తట్టాలని వచ్చిన మంగోలియన్ సింహం. ప్రపంచంలో ఒకే సూర్యుడు ఉండాలన్న సిద్ధాంతాన్ని ప్రబోధించిన ఛెంగిస్ఖాన్ ఒక చిత్రమయిన రాజకీయం చేశాడు.

తాను ఇంకా కొన్ని సంవత్సరాలకు యుద్ధానికి పోదలచిన ప్రదేశాలకు ముందుగానే తన జాతివారిని పంపాడు. అలాగే ఢిల్లీ పరిసరాలకు మంగోలియన్‌లను పంపాడు.

వారంతా ఢిల్లీ ఈశాన్య సరిహద్దులో నివాసం యేర్పరుచుకుని ఆనుపాను లన్నీ అర్థం చేసుకున్నారు. ఛెంగిస్ఖాన్ మరణానంతరం ఢిల్లీ పాలకులు మంగోలియన్ దృఢకాయుల్ని బందీలుగా పట్టుకుని బానిసల్ని చేశారు.

వారివి శక్తి సంపన్నమయిన శరీరాలు. బానిసలకు కొంతమంది సంతానం కలిగాక ఖొజ్జాలుగామార్చి అంతఃపురాలకు కాపలాగా వుంచుకున్నారు.

షేర్‌ఖాన్ డేరాబయట కాపలాకాస్తున్న మంగోలియన్ ఆ సంప్రదాయంలో తయారయినవాడు. షేర్‌ఖాన్ అతడిని ముద్దుగా 'విశ్వాసం కలిగిన కుక్క' అని పిలుచుకుంటాడు. కూచిపోతి అతనిమీద మెరుపుదాడి చేసి దొంగ దెబ్బ తీసింది. అతడు కిక్కురుమనకుండా నేలకు ఒరిగిపోయినాడు.

వెండి గూటాలకు బిగించి వున్న బంగారు గొలుసు సడలించి లోపలకు వెళ్ళేదారి చేసింది.

చారలులేని నల్లపులి డేరా లోపలకు దూరింది. డేరా గదులు గదులుగా వుంది. వెనుక గదిలో హంస తూలికా తల్పాలున్నాయి. అక్కడ నిలిచి ముందు గదిలో జరుగుతున్న శృంగారం పేరుతో జరుగుతున్న రభసను చూసింది.

షేర్‌ఖాన్ పట్టు బాలీసు ఆనుకుని కూర్చున్నాడు. సాకి ద్రాక్ష ఆసవాన్ని అందిస్తోంది. అతని ముఖం వాడిపోయి పిల్లిగడ్డం పీచులా అసహ్యంగా అవుపిస్తోంది. కళ్ళు ఎర్రగా మండుతున్నాయి. అతని ముందు కొంత మంది అర్ధనగ్న, నగ్న, సుందరీమణులు పాముల్లా మెలికలు తిరుగుతూ నాట్యం చేస్తున్నారు. వారి అంగచందాలను కళ్ళతో తాగేస్తున్నాడు షేర్‌ఖాన్.

ఒక సిపాయి పరుగు పరుగున వచ్చి "డేరాలకు నిప్పు అంటుకుంది" అని చెప్పాడు. షేర్‌ఖాన్ దానికంత ప్రాముఖ్యం ఇవ్వలేదు.

"మంటలు ఆర్పండి. చచ్చిన వాళ్ళను ఒక చోటుకు లాగండి. తెల్లవారాక ఖబర్‌స్థాన్‌లో పూడ్చండి" అని ఆజ్ఞ జారీ చేశాడు.

మళ్ళీ తన పనిలో లీనమయినాడు.

కొంతసేపు చూచాక అతనికి విసుగొచ్చింది.

చప్పట్లు చరిచాడు. ఒక వృద్ధ వనిత వంగి సలాములు కొట్టుకుంటూ వచ్చి అతని ముందు మోకాళ్ళమీద సాగిలపడిపోయి ఆజ్ఞకోసం అంజలి ఘటించింది.

కళ్ళతో ఏదో సైగచేశాడు షేర్‌ఖాన్.

వెంటనే ఒక అమ్మాయి ప్రవేశపెట్టబడింది. నిండా పదిహేను సంవత్సరాలుంటాయో లేదో! దీనాతి దీనంగా నిలబడింది. బొమ్మగుడ్డలు వొలిచినట్టు ఆమె శరీరంమీద వలువలన్నీ ఊడ్చి అవతల పారేశారు.

ఆ అమ్మాయి సిగ్గుతో చచ్చిపోతోంది తన అందాన్ని కళ్ళతో త్రాగుతున్న వృద్ధ జంబూకాన్ని కన్నెత్తి అయినా చూడలేదు.

"ఆడు, పాడు" అని కేక పెట్టాడు షేర్‌ఖాన్. ఎంతభయంగావున్నా కాలు కదల్పటం ఆ అమ్మాయి వల్ల కాలేదు.

షేర్‌ఖాన్ కొరడా ఝళిపించాడు. మల్లెపూవులాంటి శరీరమంతా మందారవర్ణం చారికలు పడ్డాయి. కొరడా దెబ్బలవల్ల తోలు వూడివస్తున్నా ఆ అమ్మాయి తొడల్ని ఎడం చెయ్యలేదు షేర్‌ఖాన్ ఉగ్రమూర్తి అయ్యాడు.

పిచ్చిగా బాదాడు. ప్రయోజనంలేదు. ఒకఖొజ్జాను లోపలకిపిలిచి "నేలమీద పడిందాకా కొట్టు" అని ఆజ్ఞాపించాడు. మరికొన్ని కొరడా దెబ్బలు తిని ఆ అమ్మాయి కాళ్ళు మెలివేసుకుని నేలమీదికి దొర్లి పడిపోయింది.

"దీన్ని గొంతులోతు గొయ్యి తీసి పూడ్చి పెట్టండి. అన్నం, మంచి నీళ్ళు యివ్వకుండా చచ్చిందాకా వుంచండి" అని ఆజ్ఞాపించి తృప్తిగా మరొక వరక తిరిగాడు.

ఆ దృశ్యాన్ని చూసిన కూచిపోతి వివశురాలయింది. రక్తం కారుతున్నదేమో అన్నంతగా కళ్ళు ఎర్రబడ్డాయి.


రామాయణాలు ఎన్నో వున్నాయి. 'అంతరార్థ రామాయణం' అన్న పేరులోనే రామాయణంలో నిగూఢంగా వున్న అర్థాన్ని చెప్పేది అని తెలుస్తుంది. ఈ నిగూఢార్థం తెలుసుకోలేకయే రామాయణంమీద ఎన్నో వికృత విమర్శలు కూడా బయల్దేరాయి. కళాప్రపూర్ణ డా॥ వేదుల సూర్యనారాయణశర్మగారు ఇట్టి వికృత విష విమర్శలకు తావులేని రీతిగా అసలు రామాయణం చరిత్ర కానేకాదంటూ అపూర్వమైన రీతిగా షట్కాండలలోని కథకంతకూ జ్ఞాన, యోగపరంగా అంతరార్థాల్ని 'అంతరార్థ రామాయణం' గ్రంథంలో వివరించారు. ఈ వివరణం అన్ని మతాలకు, అన్ని దేశాలకు, అన్ని కాలాలకు కావలసి వుంది. అసలు వాల్మీకి హృదయం ఇదే.

'అంతరార్థ రామాయణం'

వెల : 25 రూపాయలు

రచన : కళాప్రపూర్ణ వేదుల సూర్యనారాయణశర్మ

అన్ని పుస్తకాల షాపులలోను దొరుకుతుంది. లేదా మాకు పుస్తకం ధర M. O. చేస్తే 25 పైసలకు V.P.P. లో పంపుతాము.

క్వాలిటీ పబ్లిషర్స్ రామమందిరం వీధి, విజయవాడ-2.

## మల్లెపందిరి

### హెచ్చరింపు

కలహాన్తాని హర్మ్యాణి, కువాక్యాంతం చ సౌహృదం
కురాజాన్తాని రాష్ట్రాణి, కుకర్మాంతం యశో నృణాం॥

కలహించాక మేడలూ, మిద్దెలూ సున్నా అయిపోతాయి. ఒక్క తప్పుడు మాటతో స్నేహం ముక్కలయిపోతుంది. పనికిరాని రాజు బయల్దేరితే రాష్ట్రాలు (రాజ్యాలు) నాశనమౌతాయి. ఒక్క చెడ్డపని చేయగానే మనుషుల పేరు ప్రతిష్ఠలు ముగిసిపోతాయి.

—సౌభరి

శరీరం ఉక్కు ముద్దలా బిగుసుకుపోయింది.

ఒక్క గెంతులో పులిలా షేర్‌ఖాన్ మీదికి వెళ్ళి పడింది. పిల్లిగడ్డం పట్టుకుని నిలబెట్టి మోకాలెత్తి డొక్కలో ఒక్క తాపుతాకించింది. భయంకరమైన మూలుగుతో క్రిందపడిపోయినాడు షేర్‌ఖాన్.

అర్ధ నగ్నం ఆడవాళ్ళు భయంతో అరుస్తూ పారిపోయినారు. సైనికులు గుడారాన్ని చుట్టుముట్టారు. కూచిపోతి పద్మవ్యూహంలో చిక్కిన అభిమన్యుడల్లే, దొమ్మీ యుద్ధంలో దొరికిపోయిన బాలచంద్రుడల్లే, విజయనగర సేనాని చౌండప నాయకుని త్రిశూల వ్యూహంలో చిక్కిన కొండవీటి సోమదేవుడల్లే చిక్కిపోయింది.

అయినా ఆమె రవంత జడియలేదు. ఆ ప్రక్కనే మంచంమీద పడి నిద్రపోతున్న షేర్‌ఖాన్ కొడుకు పదేళ్ళవాడిని రెండుచేతులా బంధించి గాలిలోకి ఎత్తింది.

"ఎవరైనా అడుగు ముందుకు వేశారో మీ దొరకూన ప్రాణాలు దారాళమ్మ తల్లికి బలి యిస్తాను" అంటూ పొలికేక వేసింది. అయిదు వేల సైన్యం అల్లడి తల్లడి అయిపోయింది. షేర్‌ఖాన్ నిర్జీవుడయిపోయినాడు.

రాక్షసుడల్లే ప్రజల్ని విరుచుకుతిని. వాళ్ళ ప్రాణాలతో పాచికలాడి తాను సంపాదించిన ఆస్తికి ప్రథమ వారసుడు ఆ పదేళ్ళ పసివాడు. వృద్ధాప్యం వచ్చాక పుట్టాడు కనుక ప్రేమాస్పదుడు. గోలుగోలున ఏడ్చాడు షేర్.

ఆశ పెట్టాడు, లంచం యివ్వజూపాడు అయినా కూచిపోతి తన పట్టు రవంత సడలించలేదు.

"ముందు ఆ యువతిని పాతర వెయ్యకూడదని ఆజ్ఞ ఇవ్వు" అన్నది.

తక్షణమే ఆజ్ఞ యిచ్చి ఆశగా చూశాడు షేర్.

మొరటుగా ఆటవికంగా కన్పించే కూచిపోతి పెదవి విప్పింది. "మన్యాలను దోచుకోవచ్చిన కుక్కా" అంటూ ప్రారంభించింది.

షేర్‌ఖాన్ నిషా దిగిపోయింది. ఎలాగయినా కొడుకును దక్కించుకోవాలన్న తాపత్రయంతో మాటలన్నీ పడ్డాడు.

"సవరరగతమంటే సన్నీళ్ళు అనుకున్నావా? మన్యం అడవి సంపదలు నీ అబ్బ సొమ్మా! సిస్తు కట్టాల్సిన అవసరం మాకేమిటి? అడవి జంతువుల్ని వేటాడినందుకు నీకు పన్ను కట్టాలా?

పన్ను కట్టేందుకు మా దగరేమున్నాయి ప్రాణాలు తప్ప.

నీకెందుకు కట్టాలిరా పన్ను! గడ్డ నీటిని పొలాలకు మళ్ళించావా? మా ధనుర్బాణాలు నువ్వు చేయించి యిచ్చావా? సిగ్గు దాచుకుందుకు మొలకు చుట్టుకున్న ఈ గుడ్డ పీలకలు నువ్వు నేయించి యిచ్చావా? గూడాలమీద అడవిజంతువులు విరుచుకుపడితే నువ్వు రక్షణ కల్పించావా? ఎందుకు కట్టాలి పన్ను

పన్ను కట్టకపోతే గూడాలు తగులబెట్టిస్తావా? ఆడదాయిల్ని వుంపుడుగత్తెలుగా తోలుకుపోతావా? సవర వీరుల రక్తంతో మన్యం భూముల్ని తడుపుతావా?

కుక్కా! నువ్వు నన్ను పట్టుకోవాలని ప్రయత్నించినా, తెల్లవారాక మన్యం పొలిమేరల్లో కన్పించినా నీ బిడ్డ ప్రాణాలు తీస్తాను. జాగ్రత్త. తక్షణమే తోకముడుచుకుని పారిపోవాలి నువ్వు." అని హెచ్చరించి గుడారం వెనుకప్రక్కకు వచ్చింది కూచిపోతి.

చీకటిలో కలిసిపోయింది

షేర్‌ఖాన్ కనుసన్నతో సైనికులు ఆయుధాలు పారవేసి బొమ్మల్లా నిలబడ్డారు. తాను విలాసవస్తువుగా భావించే ఒక ఆడది యింతపని చేసిందేమిటా? అని రాటలా అయిపోయినాడు షేర్‌ఖాన్.

అతని మనసులో కూచిపోతి రూపమే కదలాడుతోంది.

రక్షణ లేకుండా వున్న మొరటుపాదాలు నల్లగా ఉక్కుపిండాల్లా వున్న బలమైన పిక్కలు. ఇనుప స్తంభాలకు ఆముదంరాసినట్లు నిగనిగలాడుతున్న నునుపైన బలమైన తొడలు.


కండరాలు మెలితిరిగి కనిపించే నల్లని పొట్ట. అనాచ్ఛాదితంగా వున్న వక్షోజాలు ఇనుప ముద్దల్లా,

మెడలో రంగు రంగుల బండపూసల పేరులు. మెడ మీద ఎత్తయిన మూపురం లాంటి కండరాలు. ఎర్రగా నెగడులోని చింతనిప్పుల్లా మండుతున్న కళ్ళు. ఎత్తయిన నుదురు. తైల సంస్కారం ఎరుగని. కేశపాశాలు కాలపాశాల్లాగ!

ఆ రూపం తలుచుకుందుకే భయపడిపోయినాడు షేర్‌ఖాన్. కూచిపోతి ఆజ్ఞ ప్రకారం అయిదువేల సైన్యాన్ని కదిలించుకుని తక్షణమే అక్కడ నించి కదలిపోయినాడు.

"నా బిడ్డను తెచ్చియిచ్చిన వారినిరంగవాకలో పన్నెండు గ్రామాలకు రాజుగా పట్టాభిషేకం చేస్తాను. రంగవాక ప్రభువులు కాబట్టి రంగారావు అనే బిరుదు యిస్తాను.

ఆ రాజ్యం నా పేరుమీద (షేర్ బెబ్బులి తరువాతి కాలంలో బొబ్బిలిగా మారింది) చిరకాలం నిలుస్తుంది అని మన్య గ్రామాల్లో దండోరా వేయించాడు నిస్సహాయుడయిపోయిన షేర్‌ఖాన్.



సంక్రాంతి ముగ్గు

— శారదా జనార్దన్, హైదరాబాద్

బొబ్బిలి రాజ్య స్థాపనకు అప్పుడే తొలి బీజం పడింది.

* * *

లింగప్పదొర వెలసు నాయకుడు.

ఆర్కాటు ఈశాన్య సరిహద్దులనుంచి మన్యం ప్రాంతాలకు దత్తత వచ్చిన వాశాయన నిలువున్నర ఎత్తు మనిషి. కొండ చరియలాంటి ఛాతీ! విశాల నేత్రాలు గంభీరమయిన కంఠస్వరం.

అంగ చాపువేస్తే గజన్నర!

రెండు వల్లెవాట్లు వేసే పెద్దమనిషి.

అనాగరికులయిన సవరల మధ్య తగవులు తరచూ తలఎత్తుతుంటాయి. వారి తగవులు తీర్చే న్యాయమూర్తి లింగప్పదొర. న్యాయమూర్తులు తలపాగా కాక రెండు వల్లెవాట్లు వేయటం ఆచారం.

అది న్యాయమూర్తుల వేషధారణ.

ఆయన తీర్పులలో నేర్పరి. సవరలకు ఆరాధ్యుడు. బొబ్బిలి రాజ్యస్థాపకుడు. కానున్న మహాపురుషుడు.

లింగప్పదొరకు షేర్ ఖాన్ ప్రకటన తెలియవచ్చింది.

సునిశితమైన ఆయన మేధా సంపత్తి చొచ్చుకుపోయింది. ఈ పని సవరలే చేసి ఉంటారని ఊహించాడు. రెండు వల్లెవాట్లు ధరించి అధికార హోదాలో రంగవాకకు బయలు దేరాడు

దొలబెహర యెదురొచ్చి స్వాగతం చెప్పాడు. కనక తప్పెటలు మ్రోగించి ఊరేగింపుగా గ్రామంలోకి తీసుకుపోయాడు. అర్ఘాకు దొన్నెలో పుట్టతేనెపట్టి యిచ్చాడు. ఆయుధాలను అవతల పెట్టి వచ్చి ఆయనచుట్టూచేరి నేలమీద చతికిలపడి కూర్చున్నారు సవరలు.

వెదురు కర్రలతో తయారయినఆసనం మీద లింగప్ప దొరను యెక్కించి కూర్చో పెట్టారు.

సభా కట్నాలుగా వెదురుబియ్యం, పుట్టతేనె, పులిగోళ్ళు, బండపూసలు తెచ్చి సమర్పించుకున్నారు.

అవన్నీ తీసుకుని అక్కడివారికే తిరిగి పంచి యిచ్చాడు లింగప్పదొర. తనవెంట తెచ్చిన పొగాకు వారికి కానుకగా తలా కాస్త యిచ్చాడు

పొగాకు చూడగానే సవరకు కొండంత సంబరమయింది. "దొరా! దారాళమ్మ తల్లికి దయ గలిగి నిన్ను మా దగ్గరకు పంపింది. నువ్వు దయచేసి మా గూడెనికి పండుగ చేశావు ధర్మం తెలిసిన దొరవు. మామీద అనుగ్రహంతో వచ్చావా? మరేదయినా పని వుండి వచ్చావా?" అని అడిగాడు దొల బెహర.

లింగప్పదొర గంభీరంగా గుబురు మీసాల చాటున నవ్వాడు.

"సవరదొరా! పని వుండే వచ్చాను. షేర్ ఖాన్ మన్యంలో చేసిన దుండగాలు నాకు తెలిసాయి. చాల బాధపడ్డాను దొరా!" అన్నాడు లింగప్పదొర గంభీరంగా.

షేర్ ఖాన్ పేరు వింటూనే సవరల ముఖాలు మరింత నల్లగా అయిపోయాయి. కొందరు కన్నీరు పెట్టుకున్నారు,

"దొరా! ఆడు చేసిన దుండగాలు నీకెట్టా చెప్పుకోవాలి! మా సవర రగతం పంచుకు పుట్టిన ఆడదాన్ని బానిసలుగా పట్టుకుపోయాడు సవర వీరుల రగతంతో మన్యం భూముల్ని చిత్తడి చేశాడు. పాకలుతగులబెట్టించాడు. మా బ్రతుకుల్లో చిచ్చుపెట్టాడుదొరా! ఇది తొలిసారి కాదు దొరా! అంటూ విలపించారు వారు.

లింగప్పదొర మనసు కరగింది.

వారికి అనునయ వాక్యాలు చెప్పి ఓదార్చాడు. పరిస్థితిని చక్కదిద్దుతానని హామీ యిచ్చాడు. అందుకోసమే శ్రీకాకుళం పోతున్నానని ప్రకటించాడు.

సవరలంతా సంతోషంగా చప్పట్లు కొట్టారు. లింగప్ప రంగారావు దొరను భుజాలమీదికి ఎత్తుకుని రంగవాకలో నాలుగు వీధులూ ఊరేగించారు. జేజేలు పలికారు.

అప్పటికి సాయంత్రమయింది. సంజ కెంజాయలు పశ్చిమాకాశాన పరచుకుంటున్నాయి. మల్లెపూవులా రత్నచూర్ణపు

## గాథావళి :

# కృష్ణాంజనేయం

శ్రీకృష్ణుడొకసారి ఆంజనేయుణ్ణి ద్వారకకు పిలిపించుకున్నాడు. ఆ ఆంజనేయుడు సహజంగానే బోలెడు రభస చేశాడు. గరుత్మంతుణ్ణి ముక్కు విరగ్గొట్టాడు బలరాముడి బలం డొల్ల చేశాడు. నువ్వెవరు అవతలకు పో నాకు సీతా దర్శనం కావాలి అన్నాడు సత్యభామతో. శ్రీకృష్ణుడు మేకప్ మార్చుకుని హనుమంతుడి దగ్గర సరువు దక్కించుకున్నాడు. మరో పదిహేను రోజులుండి పొమ్మని హనుమంతున్ని ఆపాడు. వారం పది రోజులలో ఆ ఊరిలో అంతా కృష్ణలీలలు పాడుకుంటుంటే విని విని కృష్ణుడంటే కుతూహలం పెరిగిపోయింది. రాముడుగా కనవడుతున్న కృష్ణుడి దగ్గరకు వెళ్ళి కొంచెం కృష్ణలీలలు చూడాలనుంది అన్నాడు. మంచి ప్లాష్‌బాక్‌లో కృష్ణ లీలలు చూసేసరికి మారుతికి హుషారెక్కిపోయింది. తన కంటే ఎక్కువ కోతిపన్లు చేసి రాముడి కంటె ఎక్కువ రాచకార్యాలు నిర్వహించిన కృష్ణుడంటే మోజెక్కువై పోయింది.



ఇంతకూ ఎవరయ్యా ఈ కృష్ణుడు అంటే కృష్ణుడన్నాడు. "నీ బాధ పడలేక ఈ రాముడి వేషం వేసుకున్నాను— కాని నేనే ఆ కృష్ణుణ్ణి ఆనాటి రాముడు— ఈనాటి కృష్ణుడూ" "నా పొరపాటు మన్నించు కృష్ణుడిది ఇంత మంచి వేషం అనుకోలేదు. ఇంక వెళతా అన్నాడు. రాముడు 'మంచిది' అన్నాడు. అప్పుడు హనుమంతుడు అన్నాడు (లీలాశుకుడి పద్యం)

విహాయ కోదండ శరౌ ముహూర్తం గృహాణపాణౌ మణిచారు వేణు
మాయూర బర్హంచని జోత్తమాంగే సీతాపతే త్వాం ప్రణమామి పశ్చాత్,
"ఆ విల్లంబులక్కడ పెట్టి కాసేపు మణులు పొదిగిన వేణువు పట్టుకో॥
నెత్తిమీద నెమలి పింఛం పెట్టుకో. రామా అప్పుడు నీకు నమస్కరిస్తాను."

—సౌభరి

రాసిలా వెలిగిన సూర్యుడు మందారంలా, పగడ చూర్ణంలా మారిపోయినాడు. ప్రపంచం మీదికి చీకటి తెరలు పరుచుకుంటున్నాయి. అడవిలో పొద్దు క్రుంగింది.

రంగవాకలో నెగళ్ళు వెలిగాయి. వేట కోసం వెళ్ళిన సవరలు ఒక్కొక్కరే గూడు చేరుకుంటున్నారు.

నెగడు చుట్టూ చేరి సవరలు తాము తెచ్చుకున్న ఆహారాన్ని కాల్చుకు తింటున్నారు. లింగప్ప దొర వెదురు కర్రల ఆసనంమీద కూర్చుని అదంతా గమనిస్తూ ఆలోచిసున్నారు.

ఆ పగలంతా వారితో కలిసి తిరిగిన మీదట షేర్‌ఖాన్ బిడ్డను వారే తీసుకువచ్చి దాచారని చూచాయగా గ్రహించారాయన. ఆ బిడ్డ యెక్కడ వున్నదీ యెవరికీ తెలియదు. ఆ రహస్యం ఒక్క కూచిపోతికి మాత్రమే తెలుసు.

వేటకై వెళ్ళిన కూచిపోతి యింకా తిరిగి రాలేదు.

దొలబెహర నెగడుదగ్గర కూర్చుని యిప్పసారా త్రాగుతూ, చీకులు కాల్చుకు తింటునాడు.

"దొరా!" అని పిలిచాడు లింగప్పదొర. దొలబెహర తలయెత్తి చూచాడు. లేచి దగ్గరగావచ్చి చేతులుకట్టి నిలిచాడు.

"షేర్‌ఖాన్ బిడ్డ యేమయినట్టు" లింగప్ప గంభీరంగా అడిగాడు.

"కూచిపోతి తెచ్చింది దొరా!" దొలబెహర వినయంగా చెప్పాడు.

"మన కష్టాలు తీరాలంటే ముందు ఆ బిడ్డను షేర్‌ఖాన్ దగ్గరకు చేర్చాలి. తండ్రి తప్పు చేస్తే బిడ్డను శిక్షించటం న్యాయం కాదు. ఆలోచించు" అన్నాడు లింగప్పదొర.

అందుకు అంగీకరించాడు దొలబెహర. తన అనుచరులందరినీ ఒప్పించాడు. సవరల క్షేమం కోసం ఆ బిడ్డను తిరిగి అప్పగించాలని కులకట్టుగా నెగడు దగ్గర నిర్ణయమయింది.

అందరూ కూచిపోతి కోసం ఎదురు చూస్తున్నారు.

చాలప్రొద్దుపోయాక అలసిన ముఖంతో తిరిగి వచ్చిన నెగడు దగ్గర కూర్చుంది కూచిపోతి. అంతవరకూ ఎవరూ ఆ చోటు విడిచి వెళ్ళలేదు. వేటాడి తెచ్చిన ముళ్ళ పందిని పిడిబాకుతో చీల్చుతోంది కూచిపోతి

"కూనా! దొరకూన ఎక్కడున్నాడు! తెచ్చి లింగప్పదొరకు అప్పగించు. సవర గూడాలను రక్షించే భారం నాది అంటున్నాడు దొర" అని కూతురుతో చెప్పాడు దొలబెహర.

నోట్లో వున్న అడవి పంది మాంసాన్ని "థుప్" అని ఉమ్మింది కూచిపోతి. "ఆడిని అప్పగించటమంటే సవరలచావుని తెచ్చి పెట్టుకోవటమే!" అంది నిర్భయంగా.

"ఆ బిడ్డను అప్పగిస్తే మీ అందరినీ రక్షించే భారం నాది. బిడ్డను ఎక్కడ దాచావో చెప్పు" అన్నాడు లింగప్పదొర. కల్పించుకుని.

కూచిపోతి లేచి నిలబడింది.

"చెప్పను దొరా! చెప్పను, ఈ గూడానికి కానున్న ఏలికగా వీరిని కాపాడుకోవలసిన బరువు బాధ్యతలు నాకూ వున్నాయి సవరల రక్తాన్ని రుచి చూసిన అడవి కుక్క షేర్‌ఖాన్. అతడిని మంచితో జయిస్తాననుకోవటం పొరపాటు. పూవుతో ఖడ్గాన్ని గాయపరచగలరా ఎవరైనా! వేటాడగలిగిన వారికే అడవి కుక్కలు వశమవుతాయి. బిడ్డను అప్పగించేది లేదు దొరా! సవరలంటే చచ్చుదద్దమ్మలు కారు. ఆ బిడ్డ మా దగ్గర వున్నంతవరకూ షేర్‌ఖాన్ గురించిన భయం మాకు లేదు" అన్నది దొరబిడ్డ కూచిపోతి.

లింగప్పదొర ఆశలన్నీ వుడిగిపోయాయి. ప్రశ్నార్థకంగా దొలబెహర వంక చూశాడాయన.

"కూనా! లింగప్ప దొరమాటల్ని కాదనకు. ఇంతకాలంగా మన తగవుల్లో, మంచిచెడ్డలు చూచుకున్నాడు దొర. ఈ మాటకూడా మన మంచికే చెబుతున్నాడు.

అంతేకాదు. బిడ్డను అప్పగించాలని కులకట్టుగా నిర్ణయమైంది. నీవు బిడ్డను తెచ్చి కులానికి అప్పగించక తప్పదు అన్నాడు దొలబెహర ఆజ్ఞాపిస్తున్నట్టుగా.

"లింగప్పదొర రంగవాక ప్రభువు కావాలి. మీకు లింగప్ప దొర కావాలి. నాకు మాత్రం సవరల యోగక్షేమాలు కావాలి. అందునించి ఏది ఎలా జరిగినా పిల్లాడిని అప్పగించేదిలేదు" అన్నది కూచిపోతి దృఢంగా.

"కులకట్టును కాదంటే శిక్ష ఏమిటో నీకూ తెలుసు. కూనా, నామాట యినుకో! బిడ్డను తెచ్చి కులానికి అర్పించుకో." అని చివరిసారిగా హెచ్చరించాడు దొలబెహర.

"కులకట్టును కాదంటే నన్ను చంపుతారు. నా కులం యోగక్షేమాల కోసం ప్రాణాలను బలియిస్తాను అంతే కాని నా ప్రాణాల కోసం కులానికి ముప్పువచ్చే పని నేను చెయ్యలేను. చెయ్యలేను" అని బదులిచ్చింది కూచిపోతి.

దొలబెహర ఆమె గుండెలమీద ఈటె ఆనించాడు.

"కూనా! నామాట యినుకో! కులకట్టు తప్పి ప్రాణాలను కోల్పోకు" అన్నాడు దయనీయంగా కన్నబిడ్డ ప్రాణాలను తీసుకోవటం యిష్టంలేక.

తల అడ్డంగా త్రిప్పింది కూచిపోతి. అంతే!

తండ్రి చేతిలోని యీటె కూతురు గుండెల్లో దిగింది. జలయంత్రంలోంచి చిమ్మినట్టు రక్తం చిమ్మింది.

నెగడు వెలుగులో నేలమీదికి ఒరిగిపోయింది కూచిపోతి.

లింగప్పదొర ఉలికిపడ్డాడు. ఆయన మనసు వ్యథాపూర్ణమయిపోయింది.


ఎందరో దేశభక్తుల రక్తంతో కాని రాజ్యాలు అవతరించవు. రాచరికపు చరిత్రలో ఇది మామూలు.

వెలమదొరల రాజ్యస్థాపనకు కూచిపోతి బలిదానం పునాదిరాయి అయింది. ఆ తరువాత దారాళమ్మ గుడిలో వున్న బిడ్డను లింగప్ప దొరకు అప్పగించారు.

లింగప్పదొర రంగవాక ప్రభువు అయినాడు. బొబ్బిలి రాజ్యస్థాపన జరిగింది. లింగప్పదొర లింగప్ప రంగారావు దొర అయినాడు.

బొబ్బిలి రాజ్య చరిత్ర అనే మహా సౌధం నిర్మితమయింది. కాని ఆ సౌధానికి తొలి పునాదిరాయిగా ప్రాణాలను బలిదానం యిచ్చిన సవరదొర బిడ్డ అయిన కూచిపోతిని చరిత్ర మర్చిపోయింది.

పాపం దొర బిడ్డ!



గంధము పూయరుగా!

—అంజనాదేవి, తెనాలి